

పరదాలపై నీటిని తొలగిస్తున్న రైతు

# అకాల వర్షంతో రైతుల అవస్థలు

- కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాసులను కాపాడుకునేందుకు పాట్లు
- ప్రభుత్వం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కోరుతున్న రైతులు

అన్నపురెడ్డిపల్లి, మే 17: అకాల వర్షాలతో అన్నదాతలు అతలాకుతలమవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని వర్షం నుంచి కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. మండలవ్యాప్తంగా శనివారం కురిసిన భారీ వర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యపు రాసులను కాపాడుకునేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడ్డారు. అప్పటికప్పుడు పట్టాలు కప్పి ధాన్యాన్ని తడవకుండా చేసుకున్నారు. వర్షం తగ్గిన తర్వాత పట్టాలపై, ధాన్యపు రాసుల చుట్టూ చేరిన నీటిని తొలగించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. అధికారులు సకాలంలో ధాన్యం కొనుగోలు చేస్తే ఇన్ని ఇబ్బందులు ఉండేవి కాదని, ఇప్పటికైనా కొనుగోళ్లు ముమ్మరం చేయాలని రైతులు కోరుతున్నారు. మరికొద్ది రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.



వర్షపు నీటికి తడవకుండా ధాన్యపు రాశి చుట్టూ బస్తా పరిచేస్తున్న రైతులు

# 14న జాతీయ లోక్ అదాలత్

**పోలీసులు, న్యాయవాదుల సమీక్షలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్**



పోలీసులు, ఇన్సూరెన్స్ కంపెనీల న్యాయవాదుల సమీక్షలో మాట్లాడుతున్న జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెం టౌన్, మే 17: జూన్ 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. కొత్తగూడెంలోని జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాలులో పోలీసు అధికారులు, ఇన్సూరెన్స్ కంపెనీ న్యాయవాదులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి.. రాజీపడదగిన పెండింగ్ క్రిమినల్ కేసులు, ఈ పిటీ కేసుల వివరాలను ఠాణాలవారీగా అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని, బీమా కంపెనీల ప్రతినిధులు తమ కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించుకోవాలన్నారు. మోటార్ వాహన ప్రమాద బాధితుల కేసులలో కక్షిదారులకు న్యాయం జరగాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీపడడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు వృథా కాదన్నారు. సమావేశంలో జడ్జిలు సాయిశ్రీ, మెండు రాజమల్లు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాగం మాధవరావు, పీపీ పీవీడీ లక్ష్మి ఏపీపీలు, పోలీస్ అధికారులు, సీఐడీసీ ఆర్‌బీ, టూటౌన్ ఎస్‌హెచ్‌వో రమేశ్‌కుమార్, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అధికార పార్టీ నేతల పట్టు?

మున్సిపాలిటీగా ఏర్పాటై మూడు నెలలు ముగిసినా మున్సిపల్ వార్డులు సిద్ధం కాలేదు. ఇంకా పంచాయతీల ద్వారానే, పంచాయతీ కార్యాలయాల పేరుమీదే పౌర సేవలు అందుతున్నాయి. అయితే ఇందుకు ఓ బలమైన కారణం ఉందంటూ విలీన పంచాయతీల ప్రజలు చర్చించుకుంటున్నారు. భవిష్యత్తులో ఏదులాపురం మున్సిపాలిటీకి ఎన్నికలు జరిగే తాము విజయం సాధించేందుకు అవకాశం ఉండే విధంగా తమ ప్రాబల్యం ఉన్న ప్రాంతాలను కలిపి ఒక మున్సిపల్ వార్డుగా విభజించాలని, అందుకు విరుద్ధంగా జరిగే వార్డుల విభజనను తాము జరగనివ్వబోమని శపథం చేస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

- ఏదులాపురం మున్సిపాలిటీకి వంద రోజులు పూర్తి
- ఇంకా పాత పంచాయతీల యూనిట్‌గానే పాలన
- మున్సిపల్ ఎన్నికలు పెడితే గెలుపు కోసం కాంగ్రెస్ నేతల ప్లాన్?
- అందుకోసం ఇప్పటి నుంచే అనుకూల వార్డుల కోసం ఎత్తుగడ?
- తమ ప్రాబల్య ప్రాంతాలను ఫలానా వార్డు చేయాలంటూ పట్టు?
- అందువల్లనే మూడు నెలలైనా కొలిక్కిరాని వార్డుల విభజన?









'పాత సీసాలో కొత్త సారా' అనే సామెతలా ఉంది ఏదులాపురం మున్సిపాలిటీ తీరు. పురపాలక సంఘంగా ఏర్పడి వంద రోజులు దాటినా పాలన మాత్రం పంచాయతీల్లోనే సాగుతోంది. మీరు పట్టణ పరిధిలోకి వెళ్లారు కాబట్టి మీకు ఉపాధి హామీ పథకం వర్తించదు. అందుకని మీకు కూలి పనులు కల్పించలేం' అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, రాజీవ్ యువ వికాసం, ఎల్ఆర్ఎస్ పథకాలను మాత్రం పంచాయతీల పేరుమీదే అమలు చేస్తోంది. దీంతో ఓ వైపు రోజువారీ పనులు కోల్పోయి ఉపాధి కూలీలు, మరోవైపు తాము గ్రామీణ ప్రజలమా? లేక పట్టణ ప్రజలమా? అనే మీమాంసలో విలీన పంచాయతీల ప్రజలు డైలమాలో ఉన్నారు. ఫలితంగా ఆయా పథకాల లబ్ధిని పొందలేకపోతున్నారు. ఇక పౌర సేవలు అందించే అధికారులదీ అదే తీరు కన్పిస్తోంది. పన్నెండు పంచాయతీలకు కలిపి ఏర్పాటుచేసిన ఏదులాపురం మున్సిపాలిటీలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి వచ్చిన ఒకరిద్దరు మినహా మిగతా అధికారులందరూ ఆయా విలీన (పాత) పంచాయతీలవారే. అదీగాక, పురపాలకంగా ఏర్పడి వంద రోజులు దాటుతున్నా పౌర సేవలు మాత్రం పంచాయతీల మీదనే అదే పంచాయతీల కార్యాలయాల్లోనే సాగుతుండడం గమనార్హం. చివరికి మున్సిపల్ వార్డులుగా ఉండాల్సిన బోర్డులు ఇంకా పంచాయతీలుగానే దర్శనమిస్తుండడం విశేషం.

–ఖమ్మం రూరల్, మే 17

## పేరు పురపాలకం..

- కానీ మున్సిపల్ వార్డులపై స్పష్టత కరువు
- గ్రామ యూనిట్‌గానే పథకాల లబ్ధిదారుల ఎంపిక
- పనులకు దూరమైన ఉపాధి హామీ పథకం కూలీలు

# పాలన పంచాయతీ



ఈ ఏడాది జనవరి చివరిలో ఖమ్మం రూరల్ మండలంలోని పన్నెండు పంచాయతీలను కలుపుకొని ఏదులాపురం పేరుతో నూతన మున్సిపాలిటీని ఏర్పాటు చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. పాలేరు నియోజకవర్గంలోనే తొలి మున్సిపాలిటీ కావడంతో సహజంగానే ఇక్కడి ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. తొలుత ఏదులాపురం పంచాయతీ కేంద్రంగా ఒక నెలపాటు అక్కడి పంచాయతీ కార్యాలయాన్నే మున్సిపాలిటీ కార్యాలయంగా ఏర్పాటు చేసి పాలనకు శ్రీకారం చుట్టింది రేవంత్ సర్కారు. తరువాత కొద్ది రోజులకు పెద్దతండా పంచాయతీ కార్యాలయం కేంద్రంగా మున్సిపాలిటీ ఉంటుందని ప్రకటించింది. అధికారులు కూడా అక్కడి నుంచి పాలనా వ్యవహారాలు ప్రారంభించారు. నూతన మున్సిపాలిటీ ఏర్పాటైన సమయంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను పునరుద్ధరించింది. దీంతో మున్సిపల్ కమిషనర్, సిబ్బంది కలిసి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్ఆర్ఎస్‌పైనే దృష్టి సారించారు. పంచాయతీ పోర్టల్ నుంచి మున్సిపల్ పోర్టల్‌కు ఇంటి నంబర్లు సహా పూర్తి డాటా విభజన ఆలస్యం కావడంతో మిగతా పనులను పక్కను పెట్టి కేవలం ఎల్ఆర్ఎస్‌పైనే అధికారులు దృష్టి సారించారు. దీనికితోడు ఇంటి పన్నుల వసూళ్ల కోసం ఆన్‌లైన్ వ్యవస్థ అందుబాటులోకి రాకపోయినప్పటికీ మాన్యువల్‌గా ఇంటి పన్నులు కట్టించుకున్నారు. ప్రధానంగా ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం.. మున్సిపల్ పాలన వ్యవహారాలను మాత్రం పూర్తిస్థాయిలో చేపట్టలేకపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### నేటికీ స్పష్టత కరువు

పురపాలక సంఘం అంటేనే మున్సిపల్ వార్డుల ద్వారా పాలన సాగాలి. అభివృద్ధి, సంక్షేమ పథకాలూ ఆయా మున్సిపల్ వార్డుల యూనిట్‌గానే అమలుకావాలి. కానీ ఏదులాపురం మున్సిపాలిటీ ఏర్పాటై వంద రోజులు గడిచినా మున్సిపల్ వార్డుల అంశంపై స్పష్టత లేదు. అయితే వార్డుల ఏర్పాటుకు సంబంధిత అధికారులు తొలినాళ్లలోనే శ్రీకారం చుట్టారు. పాత పంచాయతీల్లోని బీఎల్‌వోలతో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వార్డుల ఏర్పాటు ప్రక్రియను చేపట్టారు. మొత్తం 32 మున్సిపల్ వార్డుల ఏర్పాటు జరిగినట్లు లీకులు కూడా వచ్చాయి. అంతలోనే అధికార పార్టీ నేతల ఒత్తిడితో ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో మున్సిపల్ వార్డుల ఏర్పాటు అధికారికంగా ప్రకటించలేదు. దీంతో ఇటీవలి ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం, రేషన్‌కార్డుల వంటి పథకాల ప్రక్రియ పాత పంచాయతీల యూనిట్‌గా సాగింది. దీంతో తమకు ఆయా ప్రభుత్వ పథకాలు పంచాయతీల నుంచి అందుతాయో లేక పట్టణం నుంచి అందుతాయో అనేది అంతుచిక్కక విలీన పంచాతీయల ప్రజలు తలలు పట్టుకుంటున్నారు.

### పంచాయతీలో వేతనాలు.. మున్సిపాలిటీలో సేవలు

ఖమ్మం రూరల్ మండలంలోని పన్నెండు పంచాయతీల సెక్రటరీలతోనే ఏదులాపురం మున్సిపాలిటీ నిర్వహణ కొనసాగుతోంది. మున్సిపాలిటీ అనే పేరు కేవలం రికార్డుల్లో కన్పిస్తోంది. అంతేతప్ప క్షేత్రస్థాయిలో దాని మార్క్ కనిపించడం లేదు. ఈ మూడు నెలలుగా ఆ పన్నెండు గ్రామాల కార్యదర్శులు, ఇతర సిబ్బంది పంచాయతీ రాజ్ శాఖ నుంచి వేతనాలు, ఇతర సదుపాయాలు పొందుతున్నారు. కానీ విధులు మాత్రం మున్సిపాలిటీ నుంచి నిర్వహిస్తున్నారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ఇన్‌చార్జులుగా వచ్చిన ఒక్కరిద్దరు తప్ప మిగిలిన వారంతా పాత పంచాయతీల అధికారులే. అయితే, ఉపాధి పనులు అడిగినప్పుడు 'మీది మున్సిపాలిటీ కాబట్టి పనులివ్వడం కుదరదు' అంటున్న ప్రభుత్వం.. ఎల్ఆర్ఎస్, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల వంటి పథకాలను పంచాయతీల పేరుతోనే తమకెందుకు అందిస్తున్నారు? అంటూ ప్రశ్నిస్తున్నారు విలీన పంచాయతీల ప్రజలు.

